అభ్యాసన
సామర్థ్యాలపై సర్వే
చదవడం, రాయడం, లెక్కలు చేయడంపై పరిశీలన
ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి 12 వరకు సర్వే
7లో

150 మందికి సర్జరీ.. 4,396 మందికి అద్దాలు

పాఠశాల విద్యార్థులకు ఐ-స్ర్కీనింగ్‌లో గుర్తింపు

తొలివిడతలో 2వేల మందికి పంపిణీ

ఏర్పాట్లు చేస్తున్న సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ



సంగారెడ్డిలో విద్యార్థినికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

సంగారెడ్డి అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నాలుగు పదుల వయసు తర్వాత రావాల్సిన అంధత్వ సమస్యలు పది, పదిహేనేళ్లకే వచ్చేస్తున్నాయి. బడి పిల్లల్లో దృష్టి సమస్యల కారణంగా అభ్యసనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) కింద సర్కారు బడి పిల్లలకు జరిపిన కంటి పరీక్షల్లో దృష్టి సమస్యలను గుర్తించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో దృష్టి లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి అవసరమైన అద్దాలు పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో వైద్య ఆరోగ్య శాఖ 'స్కూల్ ఐ స్ర్కీనింగ్ ప్రోగ్రాం' ద్వారా పలు దఫాలుగా కంటి పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే.

జిల్లాలో 93,563 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

గతేడాది ఏప్రిల్ 8 నుంచి 23 వరకు తొలివిడతలో.. తిరిగి ఆగస్టు 20 నుంచి నవంబరు 29 వరకు రెండోవిడతలో వేర్వేరుగా కంటి పరీక్షలు నిర్వహించారు. రెండు విడతల్లో 78 రోజుల పాటు 'స్కూల్ ఐ స్ర్కీనింగ్' కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలోని ట్రైబల్, సోషల్ వెల్ఫేర్ స్కూళ్లలో 1 నుంచి 10వ తరగతి వరకు, అదేవిధంగా అన్ని సర్కారు పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి విద్యార్థుల వరకు 93,563 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 4,792 మందికి దృష్టిలోపాలున్నట్లు గుర్తించారు. తాజాగా వీరికి మరోసారి పరీక్షలు నిర్వహించారు. గత నెల 17 నుంచి ఈ నెల 7 వరకు నిర్వహించిన కంటిపరీక్షల్లో 4,396 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. మరో 150 మందికి ఆపరేషన్లు అవసరమని సిఫారసు చేశారు.

తొలి విడతలో 2వేల కళ్లద్దాల పంపిణీ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి పరీక్షల్లో భాగంగా దృష్టి లోపం ఉన్నవారికి అవసరమైన కళ్లద్దాల పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే జిల్లాకు తొలివిడతలో సుమారు 2వేల కళ్లద్దాలు చేరుకున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహచే కళ్లద్దాల పంపిణీ చేయడానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



తొలిసారి కేంద్రం సర్వం సిద్ధం

నేటి నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష పత్రాల మూల్యాంకనం

- మెదక్‌లో స్పాట్ వ్యాల్యుయేషన్ సెంటర్
- ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు
- విధుల్లో 450 మంది అధ్యాపకులు.. రోజూ 30 పేపర్లు
- నాలుగు విడతల్లో నిర్వహణ

మెదక్ అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఓవైపు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతుండగానే మరోవైపు మూల్యాంకనం నేటి నుంచి ప్రారంభం కానుంది. తొలిసారి మెదక్ జిల్లాకేంద్రంలో మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో స్పాట్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కేంద్రంలోని ప్రతీ గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సమాధానపత్రాల కోడింగ్ పూర్తిచేస్తున్నారు. సోమవారం ఇంటర్మీడియట్ సంస్కృతం సబ్జెక్టుకు సంబంధించిన స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభమవుతుందని ఇంటర్ నోడల్ అధికారి మాధవి తెలిపారు. మొత్తం నాలుగు విడతల్లో మూల్యాంకనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంస్కృతం అధ్యాపకులు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో రావాలని, అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్‌తో రిపోర్ట్ చేయాలని తెలిపారు. మూల్యాంకన విధుల నుంచి ఎవరికీ మినహాయింపు లేదన్నారు.

ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు

మెదక్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఇంటర్ సమాధాన పత్రాలను 450 మంది అధ్యాపకులు ఆయా సబ్జెక్టుల సమాధాన పత్రాల మూల్యాంకనం చేయనున్నారు. జవాబు పత్రాల మూల్యాంకనం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తారు. రోజుకు 30 జవాబు పత్రాలు వాల్యుయేషన్ చేయాల్సి ఉంటుంది. ఉదయం 15 పేపర్లు.. మధ్యాహ్నం 15 పేపర్లు మూల్యాంకనం చేస్తారు. సమాధానపత్రాల మూల్యాంకనంలో పొరపాట్లు జరగకుండా పర్యవేక్షణకు ప్రతీ ఐదుగురు అధ్యాపకులకు ఒక సీఈని నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఒక స్ర్కూటినైజర్, ఏసీవో వెరిఫికేషన్ అధికారులు సమాధానపత్రాలను ర్యాండమ్‌గా పరిశీలిస్తారు.

నాలుగు విడతల్లో నిర్వహణ

ఇంటర్ సమాధానపత్రాలను నాలుగు విడతల్లో మూల్యాంకనం చేయనున్నట్లు క్యాంపు అధికారులు తెలిపారు. ఈ నెల 22 నుంచి తొలివిడతలో తెలుగు, ఇంగ్లిష్, హిందీ, గణితం, పొలిటికల్‌సైన్స్ పేపర్లు వాల్యుయేషన్ చేయనున్నారు. రెండో విడత 24 నుంచి ప్రారంభమవుతుంది. ఫిజిక్స్ ఎకానామిక్స్ పేపర్ల మూల్యాంకనం నిర్వహించనున్నారు. 26 నుంచి మూడో విడతలో కామర్స్, కెమిస్ట్రీ, నాలుగోవిడతలో 28 తేదీ నుంచి హిస్టరీ, జువాలజీ, బోటనీ పేపర్ల సమాధాన పత్రాలను అధ్యాపకులు మూల్యాంకనం చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం



మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లు పూర్తిచేశాం. ఎలాంటి అవకతవకలు జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. ఉత్తర్వులు అందిన ప్రతీ అధ్యాపకుడు మూల్యాంకన విధుల్లో పాల్గొనాలి. విధులకు హాజరుకాకపోతే చర్యలు తప్పవు.

-మాధవి, ఇంటర్ నోడల్ అధికారి

రంజాన్ వేళలు
సోమవారం ఇఫ్తార్: సాయంత్రం 6.30
మంగళవారం సహర్: ఉదయం 5.05

మల్లన్నకు నీరాజనం
హోరెత్తిన జాతర
- స్వామివారి దర్శనానికి నాలుగు గంటల సమయం
- కుటుంబ సమేతంగా మంత్రి పొన్నం పూజలు
7

వనదుర్గమ్మ క్షేత్రం.. భక్తజన కోలాహలం 7

భర్త మృతి తట్టుకోలేక
గుండెపోటుతో భార్య మృతి 7

ప్రభుత్వ వైద్యం
అందని ద్రాక్షే..!
- వైద్యుడున్నా చికిత్స కరువు
- శిథిల గృహంలో పల్లె దవాఖానా
- కొత్తది నిర్మించినా తరలించేదెన్నడో..?
- రెండేళ్లైనా పీహెచ్‌సీ ఊసేలేదు
8



శిథిలమైన పెంకుటింట్లో పల్లె దవాఖానా

బ్రిడ్జి ఇరుకు.. దాటాలంటే బెరుకు

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వాహనదారులకు నరకయాతన

నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం

పెరిగిన వాహనాల సంఖ్య

కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్‌జాం



రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద ట్రాఫిక్‌జాం

రామచంద్రాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్‌లోని రైల్వే అండర్ బ్రిడ్జిని దాటడానికి ప్రయాణికులు నరకయాతన పడాల్సి వస్తుంది. ఇరువైపుల వాహనాలు ఒకే బ్రిడ్జి కింద నుంచి రాకపోకలు సాగించాల్సి రావడంతో ఇటు తెల్లాపూర్ వైపు, అటు ఎంఐజీ విద్యుత్‌నగర్ వరకు కిలోమీటర్ మేర ట్రాఫిక్‌జామ్ అవుతుంది. నాలుగు దశాబ్దాల క్రితం తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, కొల్లూరు గ్రామాలు, బీహెచ్‌ఈఎల్ పరిశ్రమను దృష్టిలో పెట్టుకుని అప్పటి జనాభా ప్రాతిప్రదికన చిన్న బ్రిడ్జిని నిర్మించారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాలు హైదరాబాద్ నగరంలో కలిసిపోయాయి. పెద్దఎత్తున అపార్ట్‌మెంట్లు, వెంచర్లు రావడంతో జనాభావ ఎన్నో రెట్లు పెరిగింది. బీహెచ్‌ఈఎల్, రామచంద్రాపురం, తెల్లాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రోసర్కిల్ తదితర ప్రాంతలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో ఈ బ్రిడ్జి కింద నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తున్నది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌లో ఇరుక్కుని వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కొత్త బ్రిడ్జి నిర్మించాల్సి ఉన్నా చొరవ తీసుకుని రైల్వే అధికారులతో మాట్లాడేవారు కరువయ్యారు. రెండు దశాబ్దలుగా ఈ అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న పార్టీలు, నాయకులు సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎన్నికలప్పుడు హామీలు ఇచ్చి తరువాత మర్చిపోతున్నారని మండిపడుతున్నారు.

నిత్యం ట్రాఫిక్‌జాం.. గొడవలు



అండర్ రైల్వేబ్రిడ్జి ఇరు వైపుల నుంచి పెద్దసంఖ్యలో వాహనాలు రావడంతో నిత్యం ట్రాఫిక్‌జాం అవుతుంది. బ్రిడ్జి మధ్యలోకి వచ్చిన తరువాత వాహనాలు ఇరుక్కోవడంతో తరచు వాహనదారుల మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నాయి. మరో మార్గం లేకపోవడంతో ఈ దారిలోనే రావాల్సి వస్తున్నది. లేదంటే 8-10 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తుంది.

-డ్రైవర్ సయ్యద్ అహ్మద్ అలీ

స్కూల్‌కు వెళ్లేందుకు రోజూ ఇబ్బందే



స్కూల్‌కు వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్రిడ్జి కింద నుంచి వెళ్లే సమయంలో బస్సులు ఇరుక్కుపోతాయని తెలిసినా ఎవరూ పక్కకు జరగరు. రోజూ దీంతో పాఠశాలకు ఆలస్యమవుతోంది. మరో బ్రిడ్జి ఏర్పాటు చేస్తే అందరికి మంచిది.

-మనోహర్, పదో తరగతి విద్యార్థి



ఊరు పట్నమైంది.. 'ఉపాధి' దూరమైంది

- మున్సిపాలిటీగా మారిన కోహీర్
- ఉపాధి హామీ పథకం రద్దు
- పనులు దొరక్క ఇబ్బందుల్లో కూలీలు



కోహీర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కల నెరవేరినవేళ తమ ఊరు పట్టణ రూపు సంతరించుకుందనే ఆనందం కోహీర్ వాసులకు కొద్దిరోజులే మిగిలింది. మున్సిపాలిటీగా ప్రకటించడంతో ఉపాధిహామీ పనులు నిలిపేయడంతో 800 మంది కూలీలు ఉపాధి కోల్పోయారు. అర్ధాంతరంగా ఉపాధిహామీ పనులు రద్దు చేయడంతో తమకు కూలీ పనులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీగా ప్రకటించడంతో అభివృద్ధి పరుగులు పెడుతుందనకుంటే ఉపాధి పోయిందని వాపోతున్నారు.

ఇబ్బందుల్లో కూలీలు

కోహీర్ మున్సిపాలిటీలో సగానికి పైగా కూలీ పనులపై ఆధారపడి జీవించే కుటుంబాలున్నాయి. వేసవిలో వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధిహామీ పనులే వారికి ఆసరాగా నిలిచేవి. కానీ ప్రస్తుతం ఉపాధిహామీ పనులు నిలిచిపోవడంతో వేసవిలో ఇళ్లు గడవడం కష్టంగా మారుతుందని వాపోతున్నారు.

అలాగే, ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికీ వారు దూరమవుతున్నారు. కనీసం 20 రోజులు ఉపాధిహామీ పనులు చేసినవారికి ఏడాదికి రూ.12వేల చొప్పున ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద చెల్లిస్తామని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కోహీర్ గ్రామంలోని కూలీలు ప్రస్తుతం ఈ పథకానికి అర్హులు కాకుండా పోతున్నారు.

పని దొరకడం లేదు



కోహీర్‌లో ఉపాధి హామీ పనులు రద్దు చేయడంతో కూలి పని దొరకడం లేదు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులే ఆసరాగా నిలిచేవి. ఉపాధిహామీ పనులు నిలిచిపోయాయి. ఇతర పనులు దొరకడం లేదు. ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఇందిరమ్మ భరోసా సాయానికి దూరమయ్యాం.

-పద్మమ్మ, ఉపాధి కూలీ, కోహీర్

ఉద్యోగం పోయింది



కోహీర్‌ను మున్సిపాలిటీగా మార్చడంతో ఉపాధి హామీ పనులు నిలిపివేశారు. దీంతో ఫీల్డ్‌అసిస్టెంట్‌గా నా ఉద్యోగం పోయింది. ఇన్నేళ్లుగా చేస్తున్న పని పోవడంతో జీవనాధారం కష్టంగా మారింది. ఉపాధి పనులు ఆగిపోవడంతో కూలీలు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దారి చూపించాలి.

-సురేష్, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్

చింత తీరేలా.. పనులు చకచకా

● వేగంగా ఖేడ్-బీదర్ జాతీయ రహదారి నిర్మాణం ● రూ.310 కోట్ల అంచనాతో పనులు





హైదరాబాద్ అకోలా ప్రధాన జాతీయ రహదారికి అనుబంధంగా నిజాంపేట్-నారాయణఖేడ్-బీదర్ మధ్య జాతీయ రహదారి 161-బీ నిర్మాణం పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కర్ణాటకలోని బీదర్ జిల్లా కేంద్రానికి నారాయణఖేడ్ ప్రాంతం వారే కాకుండా కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు చెందినవారు వ్యాపారం, వైద్యం కోసం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం నిజాంపేట నుంచి బీదర్‌కు 60 కిలోమీటర్ల రెండు వరుసల రోడ్డు ఉంది. కానీ నారాయణఖేడ్ వరకు 14 కి.మీల దూరానికే 14 మలుపులు ఉన్నాయి. దీంతో బీదర్ వరకు ఇరుకు రోడ్డును 30 మీటర్లకు విస్తరించి హైవే నిర్మిస్తున్నారు. దీంతో 14 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. భూసేకరణ పూర్తిచేసి ఆరు నెలల క్రితం పనులు చేపట్టారు. ఇప్పటి వరకు 20 శాతం పనులు పూర్తయ్యాయి. పనులు వేగంగా సాగుతుండటంతో ఈ ఏడాది చివరకు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు.

నారాయణఖేడ్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి)







ఎండ ప్రతాపం.. నీడ కోసం తాపత్రయం

భానుడు ప్రతాపం చూపిస్తున్నవేళ సంగారెడ్డిలోని వారాంతపు సంతల్లో సౌకర్యాలు కరువై చిరువ్యాపారులకు నిలువ నీడ లేకుండాపోయింది. పక్క గ్రామాల నుంచి వ్యవసాయదారులు సంతలో కూరగాయలు, సామగ్రి విక్రయిస్తుంటారు. ఎండ తీవ్రత పెరగడంతో రోడ్డు పక్కన చిరువ్యాపారులకు నీడ నిచ్చే గొడుగులు, ప్లాస్టిక్ కవర్లే ఆధారమయ్యాయి.

-సంగారెడ్డి అర్బన్, మార్చి (ఆంధ్రజ్యోతి)




హన్మంతాపూర్ పరిధిలో అనుమతులు లేకుండా తవ్విన మట్టి

తోడేస్తున్నారు

యథేచ్ఛగా చెరువులు, కుంటల్లో తవ్వకాలు
క్షేత్రస్థాయిలో కరువైన అధికారుల పర్యవేక్షణ
రెచ్చిపోతున్న ఇసుక, మట్టి మాఫియా

నర్సాపూర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలో పలు గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టి, ఇసుక తవ్వకాలను యథేచ్ఛగా చేపట్టి అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హన్మంతాపూర్ పెద్దచెరువు, చింతలకుంటలలో ట్రాక్టర్‌కు మోటార్‌ను బిగించి మట్టిని ఫిల్టర్ చేసి ఇసుకగా మారుస్తున్నారు. హన్మంతాపూర్‌లోని లావుణి పట్టా భూముల్లో పెద్దఎత్తున మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఇదే గ్రామ పరిధిలో లావుణి పట్టా భూములను తోడేస్తున్నారు. సాగుకు యోగ్యంగా లేని ఈ భూములను చదును చేస్తామంటూ నమ్మబలికి మట్టిని పెద్దపెద్ద యంత్రాలతో తవ్వేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని పలు భవన నిర్మాణాలతో పాటు ఇతర అవసరాలకు అవసరమైన మట్టిని ఇక్కడి నుంచి తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటువైపు దృష్టిసారించి అక్రమ మట్టి, ఇసుక దందాను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. నర్సాపూర్ డివిజన్ పరిధిలోని అనేక గ్రామాల్లో దందా కొనసాగుతుంది. క్షేత్రస్థాయిలో గతంలో వీఆర్‌ఏ, వీఆర్‌వోలు ఎప్పటికప్పుడు గ్రామాల్లో జరిగే విషయాన్ని మండల స్థాయి అధికారులకు సమాచారమిచ్చే వారు. ప్రస్తుతం క్షేతస్థాయి పర్యవేక్షణ లేకపోవడంతో మట్టి మాఫియా రెచ్చిపోతున్నది.

రోడ్డు ప్రమాదంలో ప్రముఖ వ్యాపారవేత్త మృతి

● ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో గట్టు రవీందర్ మృతి



గట్టు రవీందర్(ఫైల్)

సిద్దిపేట క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గట్టు రవీందర్ శనివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్టు రవి భార్య అపర్ణతో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం అర్ధరాత్రి ఓ ఫంక్షన్‌హాల్‌కు శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. నర్సాపూర్ డబుల్ బెడ్‌రూమ్ రాజీవ్ రహదారిపై ఓ వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ప్రమాదంలో గట్టు రవికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య అపర్ణకు, బైక్‌తో ఢీకొట్టిన ఓం ప్రకాష్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయాలైన వారిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఓం ప్రకాష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. గట్టు రవి మృతదేహానికి పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. రవి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతాపం వ్యక్తం చేసిన హరీశ్‌రావు

గట్టు రవీందర్ మృతిపట్ల మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం తెలిపారు. మృతి బాధాకరమని తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. వైశ్య సంఘం బలోపేతానికి కృషిచేశారని, నిత్యం సమాజ బాగుకోసం పరితపించేవారని, ఆధ్యాత్మిక ధార్మికసేవలో ముందుండి, సామాజిక సేవలో భాగస్వామ్యమయ్యే వారని గుర్తుచేసుకున్నారు.

కారులో వెళ్లి ఉంటే ఇలా జరిగేది కాదేమో - మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్



గట్టు రవీందర్ మృతిచెందడం చాలా బాధాకరం అని మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్ అన్నారు. రాంగ్‌రూట్‌లో వచ్చిన వ్యక్తి రవీందర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఇలా జరిగిందని, ఆయన కారులో వెళ్లి ఉంటే ప్రమాదం నుంచి తప్పించుకునే వారేమో అన్నారు. చనిపోయే చివరి నిమిషం వరకు ఆయన సేవా కార్యక్రమాల్లో ఉన్నారని తెలిపారు. శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో గట్టు రవిని కలవడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకో ఫ్రీజర్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది అని రవీందర్‌కి తెలిపినప్పుడు వెంటనే స్పందించి తన మిత్రులతో కలిసి ఇప్పిస్తామని చెప్పాడనీ తెలిపారు. రోడ్డు ప్రమాదాలపైనా చర్చ జరిగిందన్నారు. కలిసి చర్చించిన గంట సేపటికే రవీందర్ మరణించిన వార్త తెలిసి చాలా బాధ కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

గజ్వేల్ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన గజ్వేల్ మండలం పరిధిలోని రిమ్మనగూడ గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన రతన్ రిషి దేవ్(42) పనినిమిత్తం గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామ శివారులోని సాయి బ్రిక్స్ కంపెనీకి వచ్చాడు. రిమ్మనగూడ వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టు మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం.. రైల్వేట్రాక్ సమీపంలో పడి గాయాలై మృతి

చేగుంట మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటి రుణం చెల్లించలేక.. మనస్తాపనతో మద్యానికి బానిసయ్యాడో యువకుడు. ఆత్మహత్యకు ప్రయత్నించగా, కిందపడి తీవ్రగాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన చేగుంట మండలం వడియారం గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన దొడ్ల రమేష్ (35) ఇంటి నిర్మాణం కోసం రామాయంపేటలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.4 లక్షల అప్పు తీసుకొన్నారు. సంవత్సరం పాటు నెలకు రూ.9,200 చెల్లించారు. మిగతా కిస్తీలు కట్టలేని పరిస్థితిలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి రమేష్ అతిగా మద్యం తాగి చేగుంట మండలం వడియారం రైల్వేట్రాక్ సమీపంలో రైలు కింద పడడానికి వెళ్లాడు. సమీపంలోనే కిందపడి తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబసభ్యులు మెదక్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. రమేష్‌కు భార్య మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

వర్గల్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వర్గల్ మండలం పరిధిలో చోటుచేసుకున్నది. సంఘటనకు సంబంధించి గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సీతారంపల్లి గ్రామానికి చెందిన తూప్రాన్ వెంకటేశంకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గత సంవత్సరం పెద్ద కూతురు పెళ్లి కోసం సుమారు రూ.2 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సిలిండర్ పేలి ఇద్దరికి గాయాలు

చేగుంట మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నార్సింగి మండల కేంద్రానికి చెందిన మైలారం సిద్ధరాములు భార్య యశోద ఆదివారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్‌లో మంటలు చెలరేగాయి. దీంతో నిత్యావసర సరుకులతో పాటు పట్టా పాస్‌బుక్, రేషన్‌కార్డు తదితర వస్తువులు దగ్ధమయ్యాయి. యశోదతో పాటు దూరపు బంధువుకు స్వల్పగాయాలు కాగా, వారిని ఆస్పత్రికి తరలించారు.

యూనియన్ బ్యాంకులో చోరీకి యత్నం

శివ్వంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో చోరీకి యత్నించిన సంఘటన శివ్వంపేట మండల పరిధి దొంతిలో చోటుచేసుకున్నది. దొంతి యూనియన్ బ్యాంకులో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బ్యాంకు ప్రహరీ లోపల కిటికీని ధ్వంసం చేస్తుండగా ఓనర్ కర్రె మోహన్‌కు శబ్దం వచ్చింది. వెంటనే అతడు ఎవరిని అరవడంతో దుండగులు పరారయ్యారు. బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కునాల్ గౌతం ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

నేషనల్ ఇంటిగ్రిటీ క్యాంపులో ప్రతిభ చాటిన వర్గల్ విద్యార్థి



బహుమతిని అందుకుంటున్న వైష్ణవి, ఆమె బృందం

వర్గల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలోని బరంపూర్ యూనివర్సిటీలో నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రిటటీ క్యాంపులో వర్గల్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థి వైష్ణవి విజయం సాధించి మొదటి బహుమతిని గెలుచుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ వైష్ణవి ఇంటిగ్రిటీ క్యాంపులో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా పోతరాజు, బతుకమ్మ ఉత్సవాలపై నృత్య ప్రదర్శన చేసి మొదటి బహుమతిని గెలుచుకున్నట్లు తెలిపారు. వైష్ణవిని, బృందాన్ని కళాశాల తరఫున అభినందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.రాధారాణి, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏకధాటిగా 15 గంటల పాటు ధ్యానం

రికార్డ్ సృష్టించిన జహీరాబాద్ వాసి



ధ్యానం చేస్తున్న జ్ఞానేశ్వర్

కల్హేర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : ఏకధాటిగా 15 గంటల పాటు ధ్యానం చేసి రికార్డు సృష్టించాడు జహీరాబాద్‌కు చెందిన జ్ఞానేశ్వర్. సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం గజేంద్ర ఆశ్రమంలో అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ధ్యానం తరగతులను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జ్ఞానేశ్వర్ శనివారం సాయంత్రం 5 గంటలకు ధ్యానం ప్రారంభించగా ఆదివారం ఉదయం 8 గటంల వరకు ఏకధాటిగా చేశారు. జ్ఞానేశ్వర్ ధ్యానం చేసి రికార్డు సృష్టించినట్లు అంతర్గాం పిరమిడ్ ధ్యాన్య కేంద్రం బాధ్యులు డాక్టర్ నారాయణరావ్, గుండెరావ్ తెలిపారు. అనంతరం జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ధ్యానం చేయడంతో ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. మానవుడి శక్తి ధ్యానంలో ఉందని, ప్రతీ రోజు గంటల తరబడి ధ్యానం చేయడంతో అనేక కలిగే ప్రయోజనాలు ఉంటాయన్నారు. జ్ఞానేశ్వర్‌ను గజేంద్ర ఆశ్రమ ఉప పీఠాధిపతి అవధూత్ మహారాజ్ సన్మానం చేసి ఆశీర్వదించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దుబ్బాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిని ఆటో ఢీకొనడంతో మృతిచెందిన సంఘటన దుబ్బాక మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. దుబ్బాక మండలం పోతారం గ్రామానికి చెందిన ఎర్రోల్ల నరేష్(28) ఒక కుమారుడు ఉండగా, నెల రోజుల క్రితం తన భార్య సంధ్యకు రెండో సంతానంగా కుమార్తె పుట్టింది. పుట్టింటి వద్ద ఉన్న భార్యను తీసుకుని రావడానికి ఆదివారం ఉదయం కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం మల్కాపురం గ్రామానికి నరేష్ ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మండలంలోని ఆకారం శివారులో ఎదురుగా వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. దీంతో తలకు బలమైన గాయాలైన నరేష్ అక్కడికక్కడే మృతిచెందారు. నరేష్ తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

● భార్యాభర్తలకు గాయాలు


గౌరాయపల్లి వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

కొండపాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టిన సంఘటనలో భార్యాభర్తకు తీవ్రగాయాలైన సంఘటన కొండపాక శివారులో రాజీవ్‌రహదారిపై ఆదివారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ సనత్‌నగర్‌కు చెందిన భార్యాభర్తలైన సందీప్, అనిలా ధర్మపురికి దైవ దర్శనానికి వెళ్తున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి కమాన్ దాటాక కొండపాక శివారులో గౌరాయపల్లి వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కొండపాక 108 సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ మహేందర్, పైలట్ మహేష్ ఘటన ప్రాంతానికి చేరుకుని వారికి ప్రథమ చికిత్స అందించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోనేరు నీటిలో మునిగి బాలుడి మృతి

● మద్యం మత్తులో ఉన్న మామతో కలిసి ఈత కొడుతుండగా ఘటన


కరుణాకర్ మృతదేహం

శివ్వంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : దైవదర్శనానికి వచ్చి కోనేరులో నీట మునిగి బాలుడు మృతిచెందిన సంఘటన సికింద్లాపూర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. ఆలయ సిబ్బంది, భక్తులు తెలిపిన వివరాల మేరకు.. మచ్చ బొల్లారం గ్రామానికి చెందిన కరుణాకర్(14) స్థానిక శ్రీ శ్రీ జ్ఞాన మందిర్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మామయ్య శివకుమార్ మండల పరిధిలోని సికింద్లాపూర్ జాతరకు వచ్చాడు. శివకుమార్ మద్యం తాగి కోనేరులో దిగి ఈత కొడుతుండగా బాలుని పిలిచి ఈత కొట్టించాడు. ఈ క్రమంలో బాలుడు నీట మునగడంతో 108 వాహనం సహాయంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కరుణాకర్ మృతిచెందాడు.

చేపల వేటకు వెళ్లి యువకుడు..

రామాయంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన మత్స్య కార్మికుడు మృతిచెందిన సంఘటన ఆదివారం రామాయంపేట మున్సిపల్ పరిధి గుల్పర్తిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పేరాని నర్సింహులు(25) ఉదయం తోటి మత్స్యకార్మికులతో కలిసి ఎక్కల్‌దేవ్ చెరువులో చేపల కోసం దిగారు. జేసీబీ గుంతలో పడిపోగా నీటమునిగి ఈతరాక ఊపిరాడక చనిపోయాడు. నర్సింహులు మృతదేహం కోసం నాలుగు గంటలపాటు జాలర్లు వెతకగా, గ్యాస్ కంప్రెసర్ సహాయంతో సాయంత్రం వెలికి తీశారు. నర్సింహులుకు భార్య భవాని, రెండేళ్ల కూతురు ఉన్నది. నర్సింహులు ఐదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన చిన్న మల్లేశం ఇంటికి ఇల్లరికం వచ్చాడు. కాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించడంతో కుమారుడి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి


విజయేందర్‌రెడ్డి (ఫైల్)

వర్గల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : చదువుకోకుండా ఎందుకు తిరుగుతున్నవని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం చాంద్‌ఖాన్‌మక్తా గ్రామానికి చెందిన మార్కంటి విజయేందర్‌రెడ్డి(16) చౌదర్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. 6వ తేదీన పొలం వద్ద పనులలో ఉన్న తల్లి కనకవ్వ వద్దకు సాయంత్రం 6 గంటల సమయంలో విజయేందర్‌రెడ్డి వెళ్లాడు. ఇంట్లో ఉండి చదువుకోకుండా తిరుగుతూ పొలం వద్దకు ఎందుకు వచ్చావని తల్లి విజయేందర్‌రెడ్డిని మందలించగా తీవ్ర మనస్తాపానికి గురైన అతడు అక్కడే ఉన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన తల్లి స్థానికుల సహాయంతో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. తల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త మృతి తట్టుకోలేక గుండెపోటుతో భార్య మృతి


కొమురవ్వ(ఫైల్)

చేగుంట మర్చి 9 (ఆంధ్రజ్యోతి): భర్త మృతితట్టుకోలేక మూడు రోజుల వ్యవధిలో భార్య గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మండలం పరిధిలోని ఆదివారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లి గ్రామానికి చెందిన చింతాకుల అయ్యాలం (70) ఈనెల 7న అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త మృతిచెందిన మూడోరోజే భార్య చింతాకుల కొమురవ్వ(60)కు గుండెపోటు వచ్చి మృతిచెందారు. అయ్యాలం, కొమురవ్వకు నలుగురు సంతానం ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కొడుకులు. కుమారులు కనకయ్య, రాజు గ్రామంలోని వేరు కాపురం ఉంటున్నారు. తల్లిదండ్రులు వేరే దగ్గర ఉంటూ జీవనం సాగిస్తున్నారు. పదేళ్లుగా భర్త పక్షవాతంతో బాధపడుతూ ఉండటంతో భార్య కొమురవ్వ చూసుకుంటూ ఉండేది. ఈ క్రమంలో భర్త అయ్యాలం మృతిచెందడంతో భార్య మనోవేదన గురై గుండెపోటుతో మృతి చెందారు. మూడు రోజుల వ్యవధిలోనే భర్త, భార్య మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.



దర్శనం కోసం ఉచిత, ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు, బుకింగ్ కార్యాలయం వద్ద భక్తుల రద్దీ

మల్లన్నకు నీరాజనం

హోరెత్తిన ఎనిమిదో వారం జాతర
స్వామివారి దర్శనానికి 4 గంటల సమయం
కుటుంబసమేతంగా మంత్రి పొన్నం పూజలు

చేర్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదో వారం జాతర హోరెత్తింది. ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మకు కల్లు, బెల్లం పానకం శాకపెట్టి బోనం నివేదించారు. గంగిరేగుచెట్టుకు ముడుపులుకట్టారు. ఆలయ ఈవో రామాంజనేయులు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చేర్యాల సీఐ ఎల్.శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంతి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆదివారం కుటుంబసమేతంగా


గర్భాలయంలో కుటుంబంతో మంత్రి పొన్నం

ఆలయాన్ని సందర్శించారు. సంప్రదాయబద్ధంగా బోనం నివేదించి పట్నం రచించిన స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం జరిపి మొక్కులు తీర్చుకున్నారు.

ఉక్కపోత, దాహార్తి తీర్చుకోలేక ఇబ్బందులు

ఏడువారాలకు భిన్నంగా భక్తులు భారీగా తరలిరావడంతో ఉచిత, వీఐపీ, ప్రత్యేక దర్శన క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. స్వామివారి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. ఎండలు మండిపోవడంతో తాత్కాలిక తడకల పందిళ్లలో గంటల


దేవతావాహనంతో సిగమూగుతున్న ఆచారవతులు

తరబడిగా వేచిఉన్న భక్తులు ఉక్కబోతకు గురయ్యారు. ఆలయం తరపున వాటర్ ప్యాకెట్లను అందజేసినప్పటికీ సరిపడకపోవడంతో దాహార్తి తీర్చుకోలేక తల్లడిల్లారు.

పొంగిపొర్లిన డ్రైనేజీ నీరు

మల్లన్న ఆలయ పరిధిలోని కోడెల స్తంభం ఆవరణలో డ్రైనేజీ ఆదివారం ఉదయం పొంగిపొర్లింది. వసతి గృహాలతోపాటు గ్రామపంచాయతీ పరిధిలోని వసతిగృహాల మురుగునీటి మళ్లింపు కాలువ దెబ్బతినగా మరమ్మతుల పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి.

టికెట్ లేకుండానే వీవీఐపీ దర్శనం

● డబ్బులు దండుకుంటున్న వలంటీరు

చేర్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) కొమురవెల్లి మల్లన్న ఆలయంలో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న ఓ వలంటీర్ భక్తుల నుంచి డబ్బు పొంది టికెట్ ఇవ్వకుండా వీవీఐపీ క్యూలైన్ గుండా దర్జాగా దర్శనానికి పంపించి పట్టుబడ్డాడు. ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మల్లన్న దర్శనార్థం ఆలయానికి విచ్చేయడంతో ఆలయ వర్గాలు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇదే అదనుగా ఓ వలంటీర్ పలువురు భక్తుల నుంచి రూ.500 వీవీఐపీ టికెట్‌కు ఫోన్‌పే ద్వారా రూ.1000 వసూలు చేశాడు. టికెట్ ఇవ్వకుండానే వీవీఐపీ క్యూలో తమకు తెలిసిన వ్యక్తులని ఆలయ వర్గాలకు సూచించి పంపించాడు. కాసేపటికి అనుమానం కలిగిన ఆలయ వర్గాలు భక్తులను పిలిచి ఆరా తీయడంతో వలంటీర్ ఎవరో తమకు తెలియదని, డబ్బిస్తే దర్శనానికి పంపిస్తామని చెప్పడంతో ఫోన్ పే చేసినట్లు పేర్కొన్నారు. అది నుంచి వలంటీర్ల పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నా పర్యవేక్షణ లేకపోవడంతో భక్తుల జేబులకు చిల్లులు పెడుతూ, ఆలయ ఆదాయానికి గండిపెడుతున్నారు. ఈవిషయమై ఈవో రామాంజనేయులును వివరణ కోరగా గ్రామానికి చెందిన శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు వలంటీరు వసూళ్ల గురించి తెలిపారని, సోమవారం విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పట్నంవేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


ఏడుపాయలలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వనదుర్గమ్మ క్షేత్రం.. భక్తజన కోలాహలం


వనదుర్గామాత

పాపన్నపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లావాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాలు, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు అమ్మనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం దర్శనం కల్పించారు. మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మాతను దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. హవేళిఘణపూర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆదివారం తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, స్టోర్‌రూం, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రయోగశాలలు, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార వస్తువుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వంటగది, మూత్రశాలలు, మరుగుదొడ్లల్లో పరిశుభ్రతా చర్యలు నిత్యం పాటించాలన్నారు. పాఠశాలల్లో అందుతున్న సేవల గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మెనూను పక్కగా అమలు చేయాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో, వసతి గృహాల్లో పరిశుభ్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. పాఠశాల రిజిస్టర్‌లల్లో వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులున్నారు.


స్టోర్‌రూంలో కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్

జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో అ‘పూర్వ’ సమ్మేళనం

గజ్వేల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. దాదాపుగా 12 ఏళ్ల బ్యాచ్‌లకు సంబంధించిన విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. గతంలోని తమ అనుభవాలను ఒకరినొకరు పంచుకుని ప్రస్తుతం వారి హోదాలను తెలుపుకుంటూ పరిచయం చేసుకున్నారు. గతంలో తాము చేసిన చిలిపి పనులను, చేష్టలను గుర్తు చేసుకుంటూ తమ అధ్యాపకులతో తమకు ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. మహాసమ్మేళనంలో గతంలో పనిచేసిన ప్రిన్సిపాళ్లతో పాటు అధ్యాపకులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి ప్రస్తుత రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశం విజయవంతం కావడం పట్ల మహా సమ్మేళన కన్వీనర్ మ్యాజిక్ భాస్కర్ హర్షం వ్యక్తంచేశారు. సమ్మేళనం విజయవంతానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.


జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన మహాసమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు


అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అభ్యాసన సామర్థ్యాలపై సర్వే

చదవడం, రాయడం, లెక్కలు చేయడంపై పరిశీలన
ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి 12 వరకు సర్వే



కొండపాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు అంచనా వేసేందుకు విద్యాశాఖ సర్వేకు శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి బుధవారం వరకు ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ సర్వే నిర్వహించనున్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో లోటుపాట్ల సవరణతో పాటు మరింత అభివృద్ధి పరిచేందుకు దోహదపడేలా సర్వేను రూపొందించారు.

నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో

నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంగా ప్రతీ విద్యార్థి సొంతంగా చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు సాధించేలా కృత్యాధార బోధన కొనసాగేలా పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో బోధనలు, చిన్నారుల చదువులెలా సాగుతున్నాయో గుర్తించేందుకు సర్వే చేపట్టనుంది. సిద్దిపేట జిల్లాలో ఎంపిక చేసిన 50 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మూడు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. రెండో తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. సర్వేలో తేలిన అంశాల ఆధారంగా కనీస సామర్థ్యాలకు మరింత మెరుగైన బోధన ప్రక్రియ నిర్ణయించనున్నారు.

చతుర్విధ ప్రక్రియలపై పరిశీలన

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యార్థులు రాణించాలని, అభ్యాసన ప్రక్రియ మెరుగు పరిచేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ, లోకల్‌బాడీ పాఠశాలల్లో కార్యక్రమం అమలు తీరుపై ఎఫ్ఎల్ఎన్ శాంపిల్ సర్వేను ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు చేపట్టనున్నారు. ఈ విషయమై పలువురు కళాశాల విద్యార్థులకు, సీఆర్పీలకు జిల్లా స్థాయిలో శిక్షణ సైతం అందించారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌లకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లి రోజుకోకటి తెలుగు, ఆంగ్లంలో చదవడం, రాయడంతో పాటు గణిత ప్రక్రియలు పరీక్షంచనున్నారు. ఒక్కో విద్యార్థి ఏ మేరకు నేర్చుకున్నారు, ఇంకా ఏం కావాలి.. తదితర వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేయనున్నారు.

ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు

ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం హాజరు ఉండేలా చూడాలని, సర్వే నిర్వహణకు సహకరించాలని మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలను జిల్లా విద్యాశాఖ ఆదేశించింది. సర్వే నిర్వహణపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించింది. ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా సర్వే కొనసాగేలా చూడాలని ఆదేశాలు జారీ చేసింది.

ప్రత్యేక యాప్‌లో నమోదు



మూడు రోజుల పాటు రోజుకు ఒకటి చొప్పున తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులపై విద్యార్థుల సామర్థ్యాలను సర్వే ద్వారా పరిక్షిస్తారు. ఇది పూర్తి సాంకేతికతతో నిర్వహిస్తున్నటువంటి సర్వే. సిద్దిపేట జిల్లాలో 50 పాఠశాలలు, మూడు ఉర్దూ మీడియం పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పరీక్షలు నిర్వహించడానికి 55 మందిని నియమించాం. పరీక్ష ఎలా నిర్వాహించాలో ఇప్పటికే వారికి శిక్షణ కూడా అందించారు.

- బేతి భాస్కర్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్

ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షే..!

- వైద్యుడున్నా.. చికిత్సలు కరువు
- శిథిల అద్దె భవనంలో పల్లె దవాఖానా
- కొత్తది నిర్మించినా మారేదెన్నడో..?
- రెండేళ్లైనా పీహెచ్‌సీ ఊసేలేదు


నిజాంపేటలో నిర్మించిన నూతన భవనం


శిథిల భవనంలో నడుస్తున్న పల్లె దవాఖానా

నిజాంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య సేవలు మండల కేంద్రమైన నిజాంపేటలోని ప్రజలకు అందని ద్రాక్షగా మారాయి. రెండు దశాబ్దాలుగా శిథిలమైన పెంకుటింట్లో పల్లె దవాఖానా నడుస్తోంది. ఇటీవల కొత్త భవనం కట్టారు. ఇందులో రోగుల బెడ్లు, ఇతర సామగ్రి సైతం అందుబాటులో ఉన్నాయి. అయినా ఆస్పత్రిని మార్చడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇక్కడ ప్రతినిత్యం రోడ్డు ప్రమాద బాధితులు, ఇతర వ్యాధులతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. డాక్టర్ ఉన్నప్పటికీ సరైన వైద్య పరికరాలు లేని కారణంగా రామాయంపేట, ధర్మారం ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. అలాగే నిజాంపేటకు 2023లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైనా.. కేవలం స్థల పరిశీలనకే సరిపోయింది. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా రూ.1.43 లక్షలతో ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని అప్పట్లో హామీఇచ్చారు. కానీ రెండేళ్లు గడుస్తున్నా అతీ, గతి లేకుండాపోయింది. ఇకపోతే ప్రస్తుతం ఉదయం నుంచి సాయంత్రం వరకే నడుస్తున్న పల్లె దవాఖానా ఎందుకు పనికి రాకుండాపోతుంది. దీనివల్ల రోజూ కేవలం 30 నుంచి 40 మంది రోగులే ఇక్కడికి వస్తున్నారు. మందులే తప్ప ఎలాంటి చికిత్సలు అందకపోవటం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ప్రభుత్వ వైద్యం కరువైంది



మండల కేంద్రమైన నిజాంపేటలో ప్రభుత్వ వైద్యం కరువైంది. ఏదేని ఆరోగ్య సమస్య ఏర్పడితే ప్రైవేట్ వైద్యమే దిక్కవుతోంది. ఏళ్లుగా సరైన ఆస్పత్రి లేక, రోగాలు నయంకాక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

- ఆకుల రమేష్, బీజేపీ నాయకుడు

ఇబ్బందులు పడుతున్నాం



ఇక్కడ మహిళలకు ఆరోగ్య సమస్యలు వస్తే రామాయంపేటకు వెళ్లాల్సి వస్తుంది. పెద్ద ఆస్పత్రి కడతామని రెండేళ్ల క్రితమే చెప్పినా.. ప్రస్తుతం దాని ఊసేలేదు. దీనివల్ల వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నాం.

- బండారి చంద్రకళ, గ్రామస్థురాలు

మంజీరా నది జలాలను రక్షించాలి: సీపీఎం


రైతులతో కలిసి మంజీరా నదిని పరిశీలిస్తున్న మాణిక్యం

పుల్‌కల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం వెండికోలు, లింగంపల్లి, కోర్పోలు, సరాఫ్‌పల్లి, చౌటకూర్ తదితర గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న మంజీర నదీ జలాలను రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమేల మాణిక్యం కోరారు. పటాన్‌చెరు నుంచి ప్రవహిస్తున్న నక్కవాగు జలాలు వెండికోలు గ్రామ శివారు దిగువ భాగంలో మంజీరా నదిలో కలుస్తూ కలుషితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై సీపీఎం నాయకులతో కలిసి ఆదివారం లింగంపల్లి గ్రామంలో పర్యటించి, అనంతరం మంజీరా నది జలాలను పరిశీలించారు. పటాన్‌చెరు, ఇస్నాపూర్, పాశమైలారం, చిట్కుల్, గుండ్ల మాచునూర్ తదితర ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలను మంజీరా నదిలోకి వదులుతుండడంతో పూర్తిగా కలుషితమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నక్కవాగు కాలుష్యం నుంచి మంజీరా నది జలాలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఏ.నాగభూషణం, శ్రీశైలం, ప్రజా సంఘాల నాయకులు రాజు, శ్రీహరి, సురేష్ రైతులు దుర్గయ్య, పోచయ్య, కిష్టయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం


ఖేడ్‌లో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రధానంగా విద్య, వైద్యంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. సిర్గాపూర్ మండలం సంగం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రావుకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్కును ఆదివారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగ ప్రాధాన్యతలో భాగంగా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

భక్తులతో బోరంచ ఆలయం కిటకిట


బోరంచ ఆలయంలో నల్లపోచమ్మ దర్శనానికి బారులుతీరిన ప్రజలు

నారాయణఖేడ్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మంజీరానది తీరాన మనూరు మండలం బోరంచలో వెలసిన నల్లపోచమ్మను దర్శించుకోవడానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదరాబాద్ తదితర ప్రాంతాల భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ కిటకిటలాడాయి. దర్శనానికి వచ్చిన భక్తులకు పూజారులు సిద్ధుస్వామి, నగేష్‌స్వామి, ప్రవీణ్‌స్వామి పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గడ్డపోతారంలో కట్టమైసమ్మ జాతర

జిన్నారం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారంలో కట్టమైసమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక అయ్యమ్మ చెరువు కట్టపై వెలసిన అమ్మవారికి భక్తులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా.. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భాగిర్తిపల్లిలో బీరప్ప ఉత్సవాలు

చిన్నశంకరంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలం భాగిర్తిపల్లి గ్రామంలోని కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీరప్ప అక్క మహంకాళి జాతర నిర్వహించారు. స్వామివారికి కుంకుమ, బండారు పూజ, గంగపూజ, పట్నం పూజ, గ్రామ దేవతలకు బోనాల ఊరేగింపు, తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మల్లికార్జునస్వామి వార్షికోత్సవాలు

మనోహరాబాద్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండల కేంద్రంలో కేతకీ భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి 9వ వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, ఒగ్గు కథ, గంగకు పోవడం నిర్వహించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు

వట్‌పల్లి, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సాయిపేటలో బీరప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు దుద్దాల ఆశ్రమ పీఠాధిపతి అంబిక శివమణి యోగి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి హాజరై స్వామివారిని దర్శించుకుని, ఆలయానికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బసవరాజ్, శివాజీరావు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు

కొనసాగుతున్న జాతర

శివ్వంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనరసింహస్వామి జాతర కొనసాగుతున్నది. ఆదివారం ఆలయ ప్రధాన పూజారి ధనుంజయశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లర్క్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బాధితుడికి 'మైనంపల్లి' పరామర్శ


శంకర్‌ను పరామర్శిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

రామాయంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న వ్యక్తిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదివారం పరామర్శించారు. పట్టణానికి చెందిన బైరం శంకర్ గాయపడి ఇంట్లో రెస్టు తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మైనంపల్లి బాధితుడి ఇంటికి వెళ్లి భరోసా నింపారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, రామచందర్‌గౌడ్, రమేష్‌రెడ్డి ఉన్నారు.

'పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలి'

సంగారెడ్డి అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ కోరారు. సంగారెడ్డిలోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సాబేర్‌అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రాథోడ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి వివిధరకాల ఆర్థిక పరమైన బిల్లులు పెండింగ్‌లో ఉంచి మనోవేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ రిపోర్టు వెంటనే తెచ్చుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జీవన్‌రాథోడ్, అధ్యక్షుడు ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

సత్సంగమే మోక్షానికి దిక్సూచి

కంగ్టి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మనిషి మోక్షాన్ని పొందేందుకు సత్సంగం దిక్సూచిలా పని చేస్తుందని కర్ణాటకలోని హువ్విన శిక్లి పీఠాధిపతి చెన్నవీరమహాస్వామి అన్నారు. నిరంజన్ మహాస్వామివారి జన్మదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని నాగూర్.బిలో నిర్వహించిన పల్లకీసేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు నిండు కళశాలు, మంగళ హారతులతో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు చేపట్టారు.

ఐక్య పోరాటాలతోనే డిమాండ్ల సాధన: చుక్కా రాములు

పటాన్‌చెరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఐక్య పోరాటాలతోనే కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన సాధ్యమవుతుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చుక్కారాములు అన్నారు. ఆదివారం పలు ట్రేడ్ యూనియన్ల నాయకులు చుక్కా రాములు ఆధ్వర్యంలో కిర్బీ పరిశ్రమలో సీఐటీయూలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విభజించు పాలించు అన్న చందాన యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వివాదాస్పద భూమిలో నిర్మాణంపై సీఐ ఆగ్రహం

రామచంద్రాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సైబర్ కాలనీ (బెల్ కార్మికుల గృహ సముదాయం)లో ఆదివారం తెల్లవారుజామున సొసైటీ సభ్యులు వివాదస్పద భూమిలో సీసీరోడ్డు నిర్మించారు. ఈ విషయంలో కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు అందడంతో సీఐ రవీందర్, ఎస్ఐ రమేశ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న సొసైటీ సభ్యులతో వివాదస్పద భూమిలో ఎలా సీసీరోడ్డు వేస్తారని సీఐ ప్రశ్నించారు. ఇక్కడ విపరీతమైన దుమ్ము రావడం, గుంతలమయంగా ఉన్న ర్యాంపులో మహిళలు, వృద్ధులు, వాహనదారులు కిందపడుతున్నారని, అందుకే నిర్మించామని, ఇది తాత్కాలికమేనని చెప్పారు. కాలనీ హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో దీన్ని 40 పీట్ల రోడ్డుగా చూపారన్నారు. పైగా రోడ్డు విషయంలో కోర్టులో ఎలాంటి అభ్యంతరాలు లేవని పేర్కొన్నారు. దీంతో సీఐ రవీందర్ మీ వద్ద ఉన్న సంబంధిత పత్రాలను పోలీస్‌స్టేషన్‌లో చూపాలని వెళ్లిపోయారు.

వీరభద్రస్వామి ఆలయ చైర్మన్‌గా ప్రతాప్‌రెడ్డి

గుమ్మడిదల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్న వీరభద్రస్వామి ఆలయ చైర్మన్‌గా అన్నారం గ్రామానికి చెందిన మద్ది ప్రతాప్‌రెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రతాప్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. డైరెక్టర్లుగా యాదగిరిగౌడ్, మద్దేటి వీరస్వామి, పోతరాజు ఆశ, శ్రీనివాస్‌గౌడ్, భజరంగ్‌సింగ్, పొన్నబోయిన రాజు, పూజారి కృష్ణ, కోటేశ్‌గౌడ్, భాస్కర్‌గౌడ్ తదితరులు

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి


పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి/నారాయణఖేడ్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రయోజనార్థం ప్రభుత్వం అమలుచేస్తున్న ఎల్ఆర్ఎస్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీని ప్రకటించిన నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్నవారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ఇప్పటివరకు జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో 9,944 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎల్ఆర్ఎస్ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. ఇందుకు ఖేడ్ మున్సిపాలిటీ కార్యాలయంలో రెండు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రకటనను వెనక్కి తీసుకోవాలి: బీఆర్ఎస్

సంగారెడ్డి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ ఉచితమని ప్రకటించి, ఎల్ఆర్ఎస్ పేరుతో మళ్లీ ఫీజును వసూలు చేయడమేంటని బీఆర్ఎస్ నాయకులు నాయ కిరణ్, బండిమోహన్, యాకూబ్, శివప్ప, అప్పిరాజ్ ప్రశ్నిస్తున్నారు. ఆదివారం వారు పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న వారు నిర్ధారించిన ఫీజును మార్చి 31లోపు కడితే 25 శాతం రిబేట్ ఇస్తామనడం సరికాదన్నారు. ఫీజులు చెల్లించాలన్న ప్రకటనను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

న్యూస్ బాక్స్

'ఎన్నికల్లో ముదిరాజ్‌లకు న్యాయం చేయాలి'

మనోహరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పురం మహేష్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో వెనకబడి ఉన్నారని, అందువల్ల ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని, జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు సీట్ల శాతం పెంచాలని కోరారు.

'మానవ జన్మ మహోన్నతమైంది'

శివ్వంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మానవ జన్మ మహోన్నతమైందని సిద్దిపేట ముర్షద్ గడ్డ పీఠాధిపతి హకీం షరీఫ్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటలో భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉర్సుకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు గురువు బోధించిన మేరకు సన్మార్గంలో నడవాలన్నారు.

కవితను కలిసిన సిర్గాపూర్ నాయకులు

కల్హేర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ సిర్గాపూర్ మండలాధ్యక్షుడు సంజీవరావ్‌పాటిల్, నాయకులు పుండరీకం, అంజాగౌడ్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కార్యకర్తలు నిరుత్సాహ పడొద్దని, ముందు భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని అన్నట్లు సంజీవరావ్ పాటిల్ తెలిపారు.

గీతామందిరంలో 17వ వార్షికోత్సవం

తూప్రాన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలోని గీతా మందిరంలో ఆదివారం 17వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు తొగుట మాధవానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి హాజరై భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. రాధాకృష్ణశర్మ, ఉదయ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో గణపతిపూజ, స్వస్తివాచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, మాతృక, యోగినివాస్తు, క్షేత్ర పాలక, నవగ్రహ తదితర పూజలు నిర్వహించారు. ఇందులో భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

నర్సాపూర్/గుమ్మడిదల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నల్లవల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన దీక్ష ఆదివారం 21వ రోజుకు చేరింది. ఈ దీక్షలో నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డుకు చెందిన అఖిలపక్షం నాయకులు బాల్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు. అలాగే గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దంటూ చేపట్టిన దీక్షలు ఆదివారం 33వ రోజుకు చేరాయి. నల్లవల్లి గ్రామానికి చెందిన మహిళలు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న అనంతపద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలు

రామచంద్రాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : వెలిమెలలోని లక్ష్మీఅనంతపద్మనాభస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం సామూహికగణపతి, అనంతపద్మనాభస్వామి, లక్ష్మీ హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు సుచరితకొమురయ్య, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. కొల్లూరులోని మల్లన్న ఆలయంలో మల్లన్న బ్రహ్మోత్సవాలను ఆదివారం ప్రారంభించారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

హత్నూర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దైవ చింతనతో మానసిక ప్రశాంతత నెలకొంటుందని మాధవానంద సరస్వతి స్వామీజీ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన హత్నూరలో నిర్మించిన ఆలయంలో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఆయన చేతులమీదుగా చేశారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డీఏవో మృతి


నవీన్‌కుమార్ (ఫైల్)

అల్లాదుర్గం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ కామారెడ్డి జిల్లా కేంద్రంలో అసిస్టెంట్ డీఏవోగా విధులు నిర్వర్తిస్తున్న మున్నూరి నవీన్‌కుమార్(37) శనివారం రాత్రి మృతిచెందారు. అల్లాదుర్గం మండల కేంద్రానికి చెందిన నవీన్‌కుమార్ కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య పూర్ణిమ, ఓ కూతురు ఉన్నారు.

హరీశ్‌రావు నివాసంలో మహిళా దినోత్సవం


హరీశ్‌రావుతో మహిళా సంఘాల సభ్యులు

రామచంద్రాపురం టౌన్/పటాన్‌చెరు/అమీన్‌పూర్/ మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. అనంతరం ఆయనను మహిళలు సత్కరించారు. కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, హరీశ్‌రావుకు పూలమొక్క అందజేశారు. ఈనెల 11న పటాన్‌చెరులో నిర్వహించే మహిళా దినోత్సవానికి రావాలని మాజీ మంత్రి హరీశ్‌రావును పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి ఆదివారం ఆహ్వానించారు. బీరంగూడలో ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యురాలు సరళకుమారి హాజరై మాట్లాడారు. మహిళలు విద్యావంతులై హక్కులు తెలుసుకున్నరోజే నిజమైన స్వావలంభన సాధ్యమవుతుందన్నారు.

'సిద్ధారెడ్డి'కి ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు


ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న సిద్ధారెడ్డి

సంగారెడ్డి అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ వారి ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఎక్సలెంట్ అవార్డును సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం కోర్పోల్ జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు, జిల్లా సైన్స్ అధికారి పీ.సిద్ధారెడ్డి అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ మహిళా కో ఆపరేటివ్ చైర్‌పర్సన్ బండారు శోభారాణి, న్యూమరాలజిస్ట్ దైవజ్ఞశర్మ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. విద్యా, సామాజిక రంగాలతో పాటు మహిళా సాధికారత అంశంలో విశేష కృషి చేసినందుకుగాను ఈ పురస్కారాన్ని అందజేసినట్టు విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ ఫౌండర్ అండ్ చైర్మన్ భానుచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్ డా.వెన్నెల, వల్లూరు ఫౌండేషన్ శ్రీనివాస రాజు, కోర్పోల్ హెచ్ఎం అడివప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మల్లేపల్లి పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఉపాధ్యాయులు, పాల్గొన్న విద్యార్థులు

కొండాపూర్/పుల్‌కల్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 2007-08 పదో తరగతి, మండల కేంద్రం చౌటకూర్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం అప్పుడు చదువు చెప్పిన గురువులను సత్కరించారు.

పేదలను ఆదుకోవాలి : సీపీఎం


దగ్ధమైన గుడిసెల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గుడిసెలు దగ్ధమై నిరాశ్రయులైన పేదలను ఆదుకోవాలని సీపీఎం నాయకుడు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి పట్టణంలోని రెవెన్యూ కాలనీలో గుడిసెలు దగ్ధమైన ప్రాంతాన్ని వారు సందర్శించి మాట్లాడారు. కొన్నేళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారని, ఎవరో కక్షకట్టి గుడిసెలు తగులబెట్టారన్నారు. గుడిసెలు దగ్ధమై పేదలు రోడ్డున పడ్డా ఇంతవరకూ అధికారులు సందర్శించకపోవడం దుర్మార్గమన్నారు. గుడిసెల్లో నివాసముండే పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని, లేనిపక్షంలో పేదల పక్షాన పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. సందర్శించిన వారిలో సీపీఎం నాయకులు మల్లేశం, రాజు తదితరులు ఉన్నారు.

భూ వివాదంతోనే గుడిసె దహనం

శివ్వంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : భూ వివాదం నేపథ్యంలో తమ నివాస గుడిసెను దహనం చేశారంటూ బాధితులు పోలీస్‌స్టేషన్‌లో చేశారు. మండల పరిధిలోని బీమ్లాతండా పంచాయతీ పరిధిలోని శంకర్ తండాకు చెందిన కేతావత్ మమత భర్త రాజు, భూ యజమాని రమేష్ రెడ్డి మధ్య కొంతకాలంగా వివాదం నెలకొంది. గతంలో రాజుపై రమేష్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ క్రమంలో ఈ నెల 7న సెటిల్‌మెంట్ చేసుకునేందుకు రమేష్‌రెడ్డి మేడ్చల్‌కు రావాలని మమత, రాజుకు ఫోన్‌చేసి చెప్పాడు. వారు అక్కడికి వెళ్లారు. అదే సమయంలో మమత గుడిసెకు నిప్పంటుకుని దగ్ధమైందని స్థానికులు, పాఠశాల టీచర్ ఫోన్ ద్వారా తెలపడంతో వెంటనే వారు అక్కడికి వెళ్లి చూసేసరికి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. రమేష్‌రెడ్డి తరపు వ్యక్తి ఉసిరికపల్లికి చెందిన కృష్ణారావే తమ గుడిసెను తగులబెట్టించాడని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఉత్సాహంగా నగర సంకీర్తన


నగర సంకీర్తనలో స్థానికులు

సంగారెడ్డి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ సంతోషాలో ఉండాలని కోరుతూ రాధేక్రిష్ణ సంస్థాన్ ఆధ్వర్యంలో పట్టణంలోని హౌజింగ్ బోర్డు, రాంనగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన నగర సంకీర్తన ఉత్సాహంగా కొనసాగింది. ఇందులో చిన్న, పెద్ద తేడా లేకుండా పాల్గొన్నారు. ప్రతి ఆదివారం పట్టణంలో ఏదో ఒక వార్డుల్లో తిరుగూ ప్రజలను భక్తి మార్గం వైపు నడిపించేందుకు సంకీర్తన నిర్వహిస్తామని తెలిపారు.